ప్రజాశక్తి

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి- అరకులోయరూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ జబ్బిపనస గ్రామంలో ఎంపీ గ్రాంట్ నిధులు సుమారు 10 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని శుక్రవారం స్థానిక సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సుంకరమెట్ట పంచాయతీ కేంద్రంలో ఈ సామాజిక భవనం నిర్మించడంతో చాలా ఉపయోగకరమన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందని చెప్పారు. పంచాయతీ పరిధిలో చాలా గ్రామాలకు సామాజిక భవనాలు లేవని, వాటిని కూడా ప్రభుత్వం గుర్తించి మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొర్ర సుమంజలి, వైసీపీ మాజీ మండల అధ్యక్షుడు కొర్ర గాసి, వార్డు సభ్యులు గెమ్మెల రాంచందర్, బురిడి గణేష్, వైసీపీ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్

స్పందన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు:స్పందనలో స్వీకరించిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డి.ఆర్.ఓ పద్మావతితో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 75 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ. డి.వి.ఆర్. ఎం.రాజు, పంచాయతీ రాజ్ ఇఇ కొండయ్య పడాల్, ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి, ఎస్‌డిసి, వివిఎస్ శర్మ, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకలు నరసింహులు, ఐటిడిఏ పరిపాలనాధికారి హేమలత, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

పలు వినతులు

పాడేరు మండలం మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టెమ్మ మినులూరు పంచాయతీ పరిధిలోని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, స్థంబాలకు మరమ్మతులు చేపట్టాలని, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని పలువురు వినతి పత్రం సమర్పించారు.హుకుంపేట మండలం కొట్నాపల్లిలో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీ వలన గ్రామస్తులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని క్వారీని నిలుపుదల చేయాలని కె.చిట్టిబాబు వినతి పత్రంలో పేర్కొన్నారు. హుకుంపేట మండలంలో పలు పోలింగ్ కేంద్రాలకు ర్యాంపులు నిర్మించానని సంబంధిత బిల్లులు మంజూరు చేయాలని జె. వరహాలు వినతిపత్రాన్ని అందజేసారు. హుకుంపేట మండలం మజ్జివలస నుండి కొండయ్యపాడు గ్రామం వరకు ఏడు కిలోమీటర్లు రోడ్డు నిర్మించాలని బూర్జ ఎంపిటిసి మజ్జి హరి వినతి పత్రం సమర్పించారు. చింతపల్లి మండలం అంజలి శనివారం మాడెంబంధ గ్రామం నుండి పాల మామిడి గ్రామం వరకు మూడు కిలో మీటర్ల రోడ్డు నిర్మించాలని సి.హెచ్.రామారావు వినతి పత్రం అందజేసారు. పాడేరు మండలం వంట్ల మామిడి పంచాయతీ నందిగరువు గ్రామస్తులు నందిగరువు నుండి 12వ మైలు రాయి వరకు రోడ్డు నిర్మించాలని కోరారు.

ఎఎన్‌ఎంపై సరెండర్‌ను ఎత్తి వేయాలి

పాడేరు:పెదబయలు మండలం గోమాంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బొండపల్లి సచివాలయంలో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎం డి.చంద్రమ్మకు గోమాంగి వైద్యాధికారి నిబంధనలకు విరుద్ధంగా జారి చేసిన సరెండర్‌ను ఉపసంహరించుకోవాలని పాడేరులో సిఐటియు జిల్లా నాయకులు ఎల్. సుందరరావు ఆధ్వర్యాన పోయిపల్లి పంచాయతీ ప్రజలు స్పందనలో పిఓకు వినతిపత్రం అందజేశారు. ఏఎన్ఎం పంచాయతీ పరిధిలో సక్రమంగానే విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. స్థానిక విలేకరులతో గ్రామస్తులు వార్డు మెంబర్ పాంగి. కృష్ణ, పోయిభ రాజారావు, తిరుపతిరావులు మాట్లాడుతూ, ఏఎన్ఎం గ్రామాలకు రాకపోతే తామే అధికారులకు పిర్యాదు చేస్తామన్నారు. ఏడాది పొడవునా ఆమె రాలేదంటే మాత్రం తాము ఒప్పుకోమన్నారు. ఉన్నత స్థాయి అధికారులకు వైద్యాధికారి తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపించారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, పిఒ

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

హుకుంపేట: మండలంలోని గిరిజనేతరుల అక్రమ కట్టడాలను కూల్చి వేయాలని శుక్రవారం స్పందనలో ఆదివాసి గిరిజన సంఘం నేతలు గిరిజనులతో కలిసి జిల్లా కలెక్టర్, ఎస్.డి.సి లకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం కార్యదర్శి తాపుల కృష్ణారావు మాట్లాడుతూ, మండల కేంద్రంలో 18 రోజులుగా అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలని రిలే దీక్షలను చేపడుతున్నా అధికారులు స్పందించలేదన్నారు.గిరిజనేతరులు బహుళ అంతస్తులు నిర్మించి ఆదివాసి గిరిజనులపై దాడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజనులు రమణ, రాజు ఆనంద్,నూకరాజు మత్యరాజు,మూర్తి, బాలన్న, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సిపిఎం నేత సత్యనారాయణ

వైసిపి నుంచి సిపిఎం ప్రజా సంఘాల్లో చేరిక

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధి గొల్లగూడెంలో వైసీపీకి చెందిన వార్డు మెంబర్ సోలా కృష్ణవేణి, సోలావినోద్‌తో సహా రెండు కుటుంబాల వారు సిపిఎం ప్రజా సంఘాల్లో చేరారు. వారికి రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజినీ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రేఖపల్లి గ్రామపంచాయతీని అభివృద్ధి చేయడంతో సిపిఎం పట్ల ఆకర్షితులై చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, రేకపల్లి శాఖ కార్యదర్శి వేటగాని సూరిబాబు, ఈశ్వర్, సోడి మల్లయ్య శ్రీరామగిరి శాఖ కార్యదర్శి గుండిపూడి లక్ష్మణరావు, చల్ల హాజరత్, స్థానిక నాయకులు సోలా ఏసుబాబు, మానికల సూరిబాబు, గోసుల సాయిబాబు, సోల వరహారావు, చమ్మయ్య, పినబోయిన శ్రీను, నిలపాల బ్రహ్మయ్య, మోడెం రాము, మోగిలిపువ్ సతీష్, రత్నాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు, పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం సకాలంలో సరఫరా చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో పిఒ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని మండలాలలో ప్రతి నెల ఒకటో తారీకు నుండి 17వ తారీకు వరకు తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎండియు వాహనాల ద్వారా సకాలంలో రేషన్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఏజెన్సీలోని అన్ని ఆశ్రమ పాఠశాలలకు, మధ్యాహ్నం భోజన పథకానికి సంబంధించిన పాఠశాలలుకు కావాల్సిన రేషన్‌పై ఆరా తీశారు. ఎండియు వాహనదారులు సరిగా రేషన్ సరఫరా చేయకుంటే తగు చర్యలు తీసుకోవాలని తహాశీల్దార్లను ఆదేశించారు. ప్రతి నెల రేషన్ బియ్యం సరఫరాకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అబుసలాం, జిసిసి డిఎం జి.పార్వతీశ్వరరావు, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, తహాశీల్దార్లు ఎ.కృష్ణ జ్యోతి, ఏవి.రమణ, ఎటీడబ్ల్యూఓ రామ తులసి, జిసిసి ఎస్ఎం ముళ్ల నాగ వెంకట రాజారెడ్డి, సిడిపిఓ సంధ్యారాణి, డిప్యూటీ తహాశీల్దారు రామకృష్ణ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల తహాశీల్దార్లు, డిప్యూటీ తహాశీల్దార్లు, ఎంఇఒలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం

శిక్షణకు 73 మంది ఎంపిక

ప్రజాశక్తి-దుంబ్రిగూడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో ఉన్నతి కార్యక్రమాన్ని ఏపీఎం దొరబాబు ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పని దినాలు పూర్తి చేసిన గిరిజన కుటుంబాల నిరుద్యోగులకు ఉన్నతి ద్వారా శిక్షణ ఇచ్చి ఆయా రంగాల్లో ఉపాధిని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీవో జయఉమ అన్నారు. ఉన్నతిని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని ఎంపీపీ ఈశ్వరి, జెడ్పిటిసి సభ్యురాలు జానకమ్మ ఆకాంక్షించారు. ఇంటర్వ్యూలో 82 మంది హాజరుకాగా, 73 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను నిలిపివేయాలి

- యుటిఎఫ్ నేతల డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు:ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖలో ప్రభుత్వం చేపట్టిన అక్రమ బదిలీలను తక్షణమే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు డిమాండ్ చేశారు . శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పాఠశాల విద్యాశాఖలో ప్రభుత్వం మే నెలలో ఉపాధ్యాయ బదిలీలను కౌన్సిలింగ్ ద్వారా చేపట్టి పూర్తి చేసిందని, ఒక సంవత్సరం కూడా కాల వ్యవధి గడవకుండా కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ దొడ్డి దారిన అక్రమ బదిలీలను ప్రభుత్వం చేపట్టడం అవినీతికి నిదర్శనమన్నారు. అక్రమ బదిలీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖలో రోజు వారీ రివ్యూలు నిర్వహించే ముఖ్యమంత్రి అక్రమ బదిలీల విషయంలో దృష్టి పెట్టక పోవడం సరికాదన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని అక్రమ బదిలీలను రద్దు చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు చీకటి నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.గంగాధర్, జి.సతీష్, దుక్కులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి అవస్థలు

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని మారు మూల నాన్ షెడ్యూలు రొంపల్లి పంచాయతి పరిధి కరకవలస గ్రామంలో తాగునీటి ఎద్దడితో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో తాగునీటి పథకాలు లేవు. దీంతో, గ్రామానికి సమీపంలో ఉన్న చెలమ ఊటనీటిని తాగి రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు జె.సన్యాసి, గంగులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే తామంతా కలిసి పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

ఊట చేలమలో నీటిని తోడుతున్న మహిళలు

ప్రారంభిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మహిళల ఆదాయం పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ ఆవరణలో మానవ అభివృద్ధి విభాగం, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యాన నిర్వహించే మినరల్ వాటర్ ప్లాంట్ను శుక్రవారం ప్రారంభించారు. సురక్షిత తాగునీటి వ్యవస్థను తీసుకురావడం, మహిళలు ఆదాయం పెంపొందించుకునేందుకు వాటర్ ప్లాంట్ దోహదపడుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో వడ్డీ లేని రుణాలతోపాటు వ్యాపారాలకు ప్రభుత్వం' చేయూత అందిస్తుందని, దీన్ని సద్వినియోగ పరుచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత, ఎంపీడీవో జయఉమ, ఏపీఎం సూరిబాబు, వైకాపా మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పిఒ

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు:ఓటర్లందరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత సూచించారు. ఈ మేరకు పది రకాల గోడ పత్రికలను శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ, ప్రతి ఓటు విలువైనదని, ప్రతి ఓటరు ఓటింగ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు. ముఖ్యంగా యువత, వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు ఓటింగ్‌లో పాల్గొవాలని సూచించారు. ఈ గోడ పత్రికలను అన్ని బ్యాంకులు, పోస్ట్ ఆఫీసులు, ప్రభుత్వ కార్యాలయాలు, కూడళ్ళలో ఏర్పాటు చేయాలని స్వీప్ నోడల్ అధికారి వివిఎస్ శర్మను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి పాల్గొన్నారు.

పాడేరు: పాడేరులో శుక్రవారం 'ఓటు హక్కుపై దివ్యాంగులతో ర్యాలీ కలెక్టర్ విజయ సునీత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును వినియోగించు కోవాలని నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో జాయింట్ కలక్టర్ భావన వశిష్ట్, పిఒ అభిషేక్, సబ్ కలక్టర్ దాత్రిరెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు మాధవి, ఎస్ డబ్ల్యుఇపి కో ఆర్డినేటర్ వివిఎస్ శర్మ, మైక్రో ఇరిగేషన్ అధికారి రహీం పాల్గొన్నారు.

టిడిపి విజయమే లక్ష్యం : శిరీషా దేవి

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పని చేస్తామని ఆ నియోజకవర్గం టిడిపి అభ్యర్థి మిరియాల శిరీషాదేవి తెలిపారు. స్థానిక భాను కళ్యాణ మండపంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో శిరీషాదేవి మాట్లాడుతూ ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన తనకు రంపచోడవరం నియోజకవర్గం టిడిపి టికెట్ కేటాయించిన టిడిపి అధినేత చంద్రబాబు, నాయకులు నారా లోకేష్, అచ్చన్నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బిజెపి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తను అంగన్వాడీ వర్కర్‌గా సుమారు 8 సంవత్సరాల పాటు పని చేశానని, తన భర్త మఠం భాస్కర్ తెలుగుయువత నియోజకవర్గం అధ్యక్షుడిగా పని చేస్తున్నారని తెలిపారు. తన భర్తపై ఉన్న కోపంతో ఎమ్మెల్సీ అనంతబాబు అంగన్వాడీ వర్కర్‌గా పనిచేస్తున్న తనపై వేధింపులకు పాల్పడే వారిని, వాళ్ళ వేధింపులు భరించలేక ఉద్యోగాన్ని వదిలేసి తన భర్తతో పాటు పార్టీలో జరిగే కార్యక్రమాల్లోకి వచ్చానని చెప్పారు. అనంతబాబు అక్రమాలు అరికట్టాలంటే టిడిపి విజయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గం టిడిపి పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్, మాట్లాడుతూ శిరీషా దేవికి టికెట్ ప్రకటించడంతో అక్కడక్కడ కొద్దిపాటి అసంతృప్తులు ఉన్నాయని, వాటిని పక్కనపెట్టి అధిష్టానం ఆదేశాలనుసారం అభ్యర్థిని గెలిపించడమే ధ్యేయంగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ మండలాల టిడిపి నాయకులు బుజ్జి, అర్జున్, అడబాల బాపిరాజు, జనసేన నాయకులు కాకి స్వామి, కుర్ల రాజశేఖర్, శ్రీనివాస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిష్టానం ఆదేశాలు శిరసావహిస్తా : బాబు రమేష్

రంపచోడవరం : అధిష్టానం ఆదేశాలను శిరసావహిస్తానని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబు రమేష్ అన్నారు. నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా మిరియాల శిరీషాదేవిని ప్రకటించడంపై అక్కడక్కడ కొద్దిపాటి అసంతృప్తి ఉందని, అయినా కూడా నియోజకవర్గంలోని టిడిపి క్యాడర్ మొత్తం చంద్రబాబు ఆదేశానుసారం పనిచేయడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. శిరీషా విజయానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

చంద్రబాబు నివాసం వద్ద నిరసన తెలుపుతున్న రాజేశ్వరి, ఆమె అనుచరులు

చంద్రబాబు నివాసం వద్ద రాజేశ్వరి నిరసన

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మిరియాల శిరీషాదేవిని ప్రకటించడంతో అసంతృప్తి చెందిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, 11 మండలాలకు చెందిన తన అనుచరులతో కలిసి శుక్రవారం ఉండవల్లిలోని టిడిపి అధినేత చంద్రబాబు నివాసానికి వెళ్లారు. అయితే భద్రతా కారణాలతో వారిని లోపలకు అనుమతించకపోవడంతో వంతల రాజేశ్వరి తన మద్దతుదారులతో కలిసి చంద్రబాబు నివాసం బయట బైఠాయించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా వంతల రాజేశ్వరిని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం వంతల రాజేశ్వరి, కొందరు కీలక నేతలు చంద్రబాబుతో సమావేశమైనట్లు సమాచారం.

అరకు ఎంపీ, పాడేరు ఎమ్మెల్యే టికెట్లు టిడిపికే కేటాయించాలి

ప్రజాశక్తి-సీలేరు : అరకు ఎంపీ, పాడేరు ఎమ్మెల్యే టికెట్లు టిడిపి నాయకులకే కేటాయించే విధంగా అధిష్టానం పునరాలోచన చేయాలని టిడిపి సీనియర్ నాయకులు ముక్కల మహేష్ డిమాండ్ చేశారు. అలా చేయకుండా పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించిస్తే ఆ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను తుక్కుతుక్కు కింద ఓడిస్తామని హెచ్చరించారు. జీకే వీధి మండలంలో శుక్రవారం జరిగిన టిడిపి కార్యకర్తలు సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ బిజెపి పార్టీకి జీరో శాతం ఓటింగ్ ఉన్న ప్రాంతాలైన అరుకు పార్లమెంట్‌లో ఎంపీ, పాడేరు ఎమ్మెల్యే టిక్కెటు కేటాయించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. టిడిపి అధినేత చంద్రబాబు పునరాలోచన చేసి పాడేరు ఎమ్మెల్యే టికెట్ గిడ్డి ఈశ్వరికి కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాడేరు టికెట్ గిడ్డి ఈశ్వరికే ఇవ్వాలి

సీలేరు : పాడేరు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే టికెట్ గిడ్డి ఈశ్వరికే కేటాయించాలని మాజీ ఎంపీటీసీ పాంగి లూసి కే సన్యాసిరావు, టిడిపి కార్యకర్త రాము డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గం టిడిపి కార్యకర్తలు, నాయకుల మనోభావాలకు అనుగుణంగా టిడిపి అధినేత చంద్రబాబు పునరాలోచన చేసి ఈశ్వరికి టికెట్ ఇవ్వాలని కోరారు. ఓటు బ్యాంకు లేని బిజెపికి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు కేటాయించడంపై అసహనం వ్యక్తం చేశారు.

ఎన్నికలకు ముందే ఎమ్మెల్యేకు గుర్తుకొస్తామా?

ప్రజాశక్తి-విఆర్.పురం : రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఎప్పుడూ పట్టించుకోని మండలంలోని తుమ్మిలేరు దిగువ గ్రామాల్లో శుక్రవారం ఉన్న ఫలంగా పర్యటించడంపై స్థానికులు నిటూర్చుతున్నారు. ఎప్పుడూ తమ గ్రామాల వైపు కన్నెత్తి చూడని ఎమ్మెల్యేకు ఎన్నికలు దగ్గర పడడంతో గుర్తు కొస్తామా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ ఓట్లు కావాలి కాబట్టి ఈ హడావుడి పర్యటనలు చేస్తున్నారంటూ సర్వత్రా చర్చ జరుగుతోంది. పోలవరం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు రావాల్సిన ప్యాకేజీ, ఇచ్చిన హామీ మేరకు రూ.10 లక్షల పరిహారం, గతంలో లక్షా 15వేలు ఇచ్చిన భూములకు రూ.5లక్షలు వంటివి నెరవేర్చలేదని, వరదల సమయంలో ముంపునకు గురైన పట్టించుకోలేదని, ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని ఈ పర్యటనలు చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

దీక్షలు విరమించిన లారీ యజమానులు

ప్రజాశక్తి -చింతూరు : మండలంలోని ఎర్రంపేట ప్రభుత్వ కలప అడితి ఎదురుగా లారీ ఓనర్స్ అసోసియేషన్ చేపట్టిన నిరాహార దీక్షలు 12వ రోజు శుక్రవారం విరమించారు. కలపడిపోలో ఏజెంట్లుగా పనిచేస్తున్న అజయ్ కుమార్, రామకృష్ణ, వరప్రసాద్, అటవీ శాఖ డిఆర్ఓ, రేంజర్ అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విషయం విధితమే. రేంజ్ ఆఫీసర్ కొండలరావు, డిఆర్ఓ శివ శంకర్, వరప్రసాద్, రామకృష్ణ, బిజెపి మండల అధ్యక్షులు డివిఎస్ రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆహమ్మద్ అలీ సమక్షంలో లారీ ఓనర్స్ అసోసియేషన్‌తో సంప్రదింపులు జరిపారు. ఇక నుండి చింతూరు లారీ యూనియన్ ద్వారానే రవాణా జరుపుతామని హామీ ఇచ్చారు. దీంతో లారీ ఓనర్లు దీక్ష విరమించారు. కార్యక్రమంలో లారీ యజమానులు బాలాజీ, కె.మహాలింగం, నక్క శ్రీను, నారాయణ, వెంకటరామ రెడ్డి, అనిల్ కుమార్, కోట్ల సూర్య ప్రకాష్, ఎస్‌కే బాబ్జి, ఎం రామ, దుర్గా ప్రసాద్ రెడ్డి, ఏ శ్రీను పాల్గొన్నారు.

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యాన మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డ గ్రామంలో సిఆర్పిఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. సిఆర్పిఎఫ్ వైద్యనిపుణులు నితిన్, సీలేరు పిహెచ్సి వైద్యాధికారిణి డాక్టర్ సౌమ్య సుమారు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజమండ్రి సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ సెకండ్ వింగ్ కమాండెంట్ సెంటిల్ కుమార్, ఇన్స్పెక్టర్లు సుభాష్ కేడి, సుందరం పాండే, స్థానిక ఎస్సై రామకృష్ణ, సిఆర్‌పిఎఫ్ పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జెకెసి ట్రస్టు ఆధ్వర్యాన నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి- విఆర్.పురం, కూనవరం : రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న పేద, మధ్యతరగతి ముస్లిం కుటుంబాలకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కూనవరం మండలంలోని కూనవరం, భీమవరం, టేకులబోరు, విఆర్.పురం మండలంలోనూ ఒక్కో కుటుంబానికి 10 కేజీలు బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పంచదార, ఉప్పు, మంచి నూనె ప్యాకెట్, కారం తదితర సరుకులు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్.పురం గ్రామ పెద్దలు సర్ఫారాజ్, ముస్లిం కమిటీ సభ్యులు, కూనవరం మజ్ జిద్ కమిటీ వారు సూఫీ షరీఫ్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందిస్తున్న జమాల్‌ఖాన్

పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి : పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ వైఎన్.భద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం కొత్తూరు మేజర్ పంచాయతీ వద్ద శుక్రవారం కార్మికులతో కలసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో చెవెటి నేస్తాలు, కలిగొట్ల నాయుడు, నాగేశ్వరరావు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు శుక్రవారం కశింకోటలో నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, కాంగ్రెస్ మలపరెడ్డి కోటేశ్వరరావు, కత్తిర శ్రీధర్ తదితరులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని ఐతంపూడి, రాజాం గ్రామాలకు చెందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ కుమారుడు సూర్య శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరావు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సబ్బవరం : రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద ఉన్న మర్రిపాలెం పోలీస్ చెక్ పోస్ట్‌ను జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ శుక్రవారం అకస్మాత్తుగా తనిఖీ చేసి విధుల్లో ఉన్న సిబ్బందితో సమీక్షించారు. సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్.ధనుంజయ పాల్గొన్నారు.

రహదారి ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కసింకోట- బంగారుమెట్ట రోడ్డు నుండి గొన్నవానిపాలెం వెళ్లే రహదారిని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గురువారం సాయంత్రం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పినపోలు రామునాయుడు, జడ్పిటిసి దొండ రాంబాబు పాల్గొన్నారు

పాఠశాలలో 'లిప్' బృందం తనిఖీలు

విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న బృందం సభ్యులు

ప్రజాశక్తి- నక్కపల్లి : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ప్రధానోపాధ్యాయులు వేమగిరి సూకరాజు ఆధ్వర్యంలో లిప్ పరిశీలనా బృందం శుక్రవారం పరిశీలించింది. సబ్జెక్ట్ నిపుణులు ఉపాధ్యాయులు బోధనా సాధనా మీటయిడ్ని ఎలా బోధిస్తున్నారో పరిశీలించారు. దీనికి సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక పరీక్షల నిర్వహించిన అనంతరం ఇప్పటివరకూ విద్యార్థులు సాధించిన ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సలీమా, నాగలక్ష్మి, సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్ లు రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ నైపుణ్యతపై అవగాహన

ప్రొఫెసర్ గుప్తను సత్కరిస్తున్న సాంకేతిక కాలేజీ యాజమాన్యం

ప్రజాశక్తి -పిఎం.పాలెం: స్థానిక సాంకేతిక విద్యాపరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ డెవలప్‌మెంట్ సెల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం ఎంప్లాయ్ ఎబిలిటీ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ఎయు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ బివిఆర్.గుప్త రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించి, ఉద్యోగ నైపుణ్యతపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ ఎస్ వి.రాజేంద్ర, ఇడి ఎస్.రాహుల్ అశ్వర్‌దాస్, ఇఒ మధుకర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జెఆనంద్ చందూలాల్, ఎఒ ఎ.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌సి అనిల్, ప్రొఫెసర్ హరిబాబు, ప్రొఫెసర్ రమణమూర్తి, మెకానికల్ విభాగాధిపతి ఎం.పద్మనాభం, మెకానికల్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : చిప్పాడ దివిస్ సంస్థ చొరవ తీసుకుని పరీక్ష ఫీజు చెల్లించిన15 మంది టెన్త్,18 మంది ఇంటర్ ఓపెన్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హాల్ టిక్కెట్లు అందజేశారు.

భీమిలి మండలం చిప్పాడ, అన్నవరం, పెద నాగమయ్య పాలెం పంచాయతీల్లో చదువుకు దూరమై డ్రాపౌట్గా ఉన్న విద్యార్థులను గుర్తించి, వారికి ఓపెన్‌స్కూల్‌లో పరీక్షలు రాసేట్లుగా ప్రోత్సాహించిన చిప్పాడ దివిస్ సంస్థ, వారి పరీక్ష ఫీజు కింద రూ.రూ 28 వేలు చెల్లించినట్లు సంస్థ సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- రోలుగుంట : కొత్తకోట సీఐ ఎల్.అప్పల నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రోలుగుంట గ్రామంలో 50 మంది పోలీసులతో కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ కవాతు మెయిన్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట ఎస్సై సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

మాట్లాడుతున్న శంకర్‌నాయక్

ప్రజాశక్తి-అనకాపల్లి: గిరిజన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ప్రత్రికా సమావేశంలో ఆయన తన రెండురోజుల పర్యటన వివరాలు తెలియజేశారు. వి.మాడుగులలో వసతి గృహాలకు శాశ్వత భవనాలు మంజూరు, వడ్డాదిలో బాలుర, బాలికల కళాశాల సంక్షేమ వసతి గృహాలు ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ విద్యార్థులు వినతిపత్రం సమర్పించినట్లు వెల్లడించారు. రోలుగుంట మండలం అర్ల, లోసింగి, రావికమతం మండలంలో చలిసింగం గ్రామాలను శాసనసభ్యుల కరణం ధర్మశ్రీతో కలిసి సందర్శించి, సమస్యల పరిష్కారానికి ఆదేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆర్‌ఎస్‌వి దొర, గిరిజన విద్యార్థి సమాఖ్య ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు యు.భానుచందర్, ట్రైబల్ రైట్స్ ఫోరమ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.పూర్ణరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగ శిరీష పాల్గొన్నారు.

జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

వ్యకాస ఆధ్వర్యాన నిరసన తెలియజేస్తున్న జీడి రైతులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : జీడి పిక్కలకు గిట్టుబాటు ధర ప్రకటించి, ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. మండలంలోని వాలాబు పంచాయతీలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిబి.దొర అధ్యక్షతన వ్యకాస జీడి రైతుల సదస్సు జరిగింది. అనంతరం తమ డిమాండ్లపై రైతులు నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా వెంకన్న, శంకరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీడి పంటకు మద్దతు ధర ప్రకటించకపోవడంతో, వ్యాపారులు తమకు ఇష్టమొచ్చిన ధరకు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం జీడి పిక్కలు 80 కేజీల బస్తాను వ్యాపారులు రూ.7వేలకు కొనుగోలు చేస్తున్నారని, ఒక బస్తా జీడిపిక్కల నుండి 25 కేజీల పప్పు వస్తుందని, కేజీ పప్పు ధర రూ.800 చొప్పున, ఒక బస్తా పిక్కలకు రూ.20 వేలు వస్తుందని తెలిపారు. ఒక బస్తా పిక్కలు ప్రోసెసింగ్‌కి రూ.2వేలు ఖర్చు అవుతుందని, రైతులు కోరిన విధంగా బస్తా జీడిపిక్కలు ధర రూ.16వేలు ప్రకటించినా ఇంకా వ్యాపారులకు రూ.2వేలు మిగులుతుందని పేర్కొన్నారు. దీంతో పాటు జీడి తొక్క, నూక, ఇతర ఉప ఉత్పత్తుల నుంచి కూడా వ్యాపారులు ఆదాయం పొందుతున్నారన్నారు. ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తే ఇటు రైతులకు, అటు వినియోగదారులకు లాభం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్.లక్ష్మణ, డి.శంకర్, బి నాగేశ్వరరావు, సోముల కృష్ణ, పి అప్పలరాజు, కె రాము, బి దేముడు, సిహెచ్ దేముడు, ఈశ్వరరావు, డి సోమయ్య, మామిడి దేముడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన పొత్తుపై భిన్నాభిప్రాయాలు

ప్రజాశక్తి చోడవరం : టిడిపితో, జనసేన పార్టీ ఎన్నికల్లో కలిసి పని చేయడంపై చోడవరంలోలో శుక్రవారం నిర్వహించిన జనసేన సమావేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. చోడవరం టికెట్ జనసేనకు కేటాయిస్తారని ఆశగా ఎదురు చూసిన తమకు నిరాశ ఎదురైందని వాపోయారు. టిడిపితో కలిసి పనిచేయడమంటే కుదరని పని అని కొంతమంది మండల స్థాయి నాయకులు కరాఖండిగా చెప్పారు. టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్ రాజు ఎన్నికలైన తర్వాత తమకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వడన్నారు. ఐదేళ్లగా నియోజకవర్గం సమస్యలపై జనసేన పార్టీ పోరాడినా, కెఎస్ఎన్ఎస్.రాజు కనీసం తమతో కలిసి రాలేదని జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి పివిఎస్ఎన్ రాజు తెలిపారు. అటువంటి వ్యక్తితో ఎన్నికల్లో ఎలా కలిసి పని చేస్తామని ప్రశ్నించారు. టిడిపి, జనసేన స్టీరింగ్ కమిటీ నిర్ణయం ప్రకారం ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి లికిత పూర్వకంగా జనసేన రాసిస్తేనే మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. దీనిపై కొంతమంది కార్యకర్తలు సుముకుత వ్యక్తం చేయగా కొంతమంది పెదవిరించారు.

ఓటు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలం తేగాడలో గ్రామ సంఘం, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేసి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపిటిసి తుంపాల మంగతాయారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, ఏపిఎం ఎస్.శ్రీనివాసరావు, సీసీ అనురాధ, విఓఏలు మంగలక్ష్మి, చినపాప పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

అధికారులతో మాట్లాడుతున్నఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్: ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం సూచించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న స్క్వాడ్ బృందాలు నిఘా పెంచాలని సూచించారు. ఎన్నికల కేంద్రాల వద్ద పరిస్థితిని సమీక్షించి కచ్చితమైన సమాచారాన్ని సెక్టార్ అధికారుల నుంచి సేకరించాలన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -కోటవురట్ల : ఈనెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మండల కేంద్రంలోని బాలికల పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. తెలుగు మీడియంలో 194, ఇంగ్లీష్ మీడియంలో 287, విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరిలో బాలికలు 219, బాలురు 262 ఉన్నట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా 412 మంది విద్యార్థులు మండలంలోని రెండు కేంద్రాలలో పరీక్షల్లో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి -మాడుగుల: ద్విచక్ర వాహనం నుండి జారి లారీ కింద పడిన మహిళ మృతి చెందింది. మాడుగుల మండలం కేజే పురం జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..ఎం.కోటపాడుకు చెందిన గొల్కొండ ఈశ్వరరావు తన భార్య సత్యవతితో ద్విచక్ర వాహనంపై గాజువాకలో బంధువుల ఇంటి నుండి స్వగ్రామం ఎం కోటపాడు వస్తున్నారు. ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పై నుండి జారి పడిన మహిళ సిమెంట్ లోడ్ లారీ చక్రం కింద పడి మృతి చెందింది. భర్త ఈశ్వరరావుకు బలమైన గాయాలు తగలడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. సత్యవతి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :మండలంలోని వడ్డాది గ్రామ శివార్లలో పేకాట శిబిరంపై శుక్రవారం సాయంత్రం ఎస్సై డి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. నలుగురిని అరెస్ట్ చేసి వారి నుండి రూ.4,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి - చీడికాడ : నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసినట్లు చీడికాడ ఎస్సై నారాయణరావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమకు అందిన సమాచారం మేరకు చీడిపల్లి గ్రామ శివార్లలో తనిఖీ చేయగా నాటు సారా తయారీకి నిల్వ చేసిన సుమారు 800 లీటర్ల బెల్లం పులుపు గుర్తించి ధ్వంసం చేశామన్నారు.

అనకాపల్లి డెస్క్ : రావికమతం మండలంలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన పులుపును రావికమతం ఎస్ఐ ధనంజయనాయుడు సిబ్బందితో దాడి చేసి ధ్వసం చేశారు. మండలంలోని గుమ్మాలపాడు గ్రామంలో 3,400 లీటర్ల పులుపు ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - సీతమ్మధార : ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాలలో భాగంగా జిల్లా అంథత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల వద్ద డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు ర్యాలీని ప్రారంభించగా, సత్యం జంక్షన్ మీదుగా రామా టాకీస్ వరకు సాగింది.అంతకుముందు కంటి ఆసుపత్రి ఆవరణలో వైద్య.విద్యార్థులు కన్ను ఆకృతిగా ఏర్పడి కూర్చున్నారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి, డాక్టర్ రమణ, డాక్టర్ ప్రేమలత, డాక్టర్ పద్మావతి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ శ్రీలక్ష్మి, పిఎంఒలు ఉమా శ్రీనివాస్, సురేష్ సుబ్బలక్ష్మి, సుజాత, వైద్య విద్యార్థులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

వైసిపి బిసి సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ప్రతాప్

సిఎం జగన్‌తో ప్రతాప్

ప్రజాశక్తి- మాధవధార: వైసిపి బిసి సెల్ రాష్ట్ర సంయుక్తకార్యదర్శిగా పైడిప్రతాప్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని అందుకున్నారు. పార్టీ అభివృద్ధికి పనిచేసిన కార్యకర్తలకు ఎపుడూ గుర్తింపు ఉంటుందన్నారు.. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు

సుందరీకరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సి హార్స్ జంక్షన్ నుంచి విశాఖపట్నం పోర్టు పరిపాలనా భవనం వరకు సుందరీకరణ పనులను విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ప్రారంభించారు. అందుకోసం రూ.2.23 కోట్లను పోర్టు కేటాయించినట్టు తెలిపారు. విశాఖపట్నం పోర్టు, జివిఎంసి కలిసి అన్ని ప్రదేశాలనూ పచ్చదనంతో నింపుతున్నాయన్నారు. భీమిలి నుంచి విశాఖపట్నం పోర్టు ప్రాంతం వరకు మడ అడవులను పెంచే ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాధ్, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, పోర్టు విభాగాధిపతిలు, అధికారులు పాల్గొన్నారు.

ఎపిలో పోటీకి సిద్ధం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు తెలిపారు. తమ పార్టీకి ఎపిలో పోటీ చేసేందుకు సైకిల్‌కు గాలి కొడుతున్న పంపు గుర్తును ఎన్నికల కమిషన్ కేటాయించిన సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం నుంచి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతం ఎక్కువగా వున్న ఉత్తరాంధ్ర నేటికీ వెనుకబడి వుందన్నారు. తాము అధికారంలోకి వస్తే అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ నేత బొట్టా మధు యాదవ్, ఉత్తరాంధ్ర ఇంఛార్జి, మహిళా అధ్యక్షురాలు డాక్టర్ జాలాది విజయ, జగదీష్ పాల్గొన్నారు.

'వండర్ కిడ్స్'లో ఢిల్లీ విద్యావేత్తల బృందం పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కృతి సంప్రదాయాలను సమపాళ్లలో అందిస్తున్న స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ఓ అద్భుతమని ఢిల్లీ విద్యావేత్తల బృందం కొనియాడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మెంటార్ కృష్ణారెడ్డి, విశాఖపట్నం అపుస్మా సభ్యులు ఎంవివి సత్యనారాయణతో పాటు ఢిల్లీ, హర్యానా నుంచి ఆరుగురు విద్యావేత్తల బృందం శుక్రవారం ఉదయం సిరిపురంలోని వండర్ కిడ్స్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడి చిన్నారులు అసాధారణ ప్రతిభ కనబరిచారన్నారు. గతంలో విద్యావిధానాన్ని పరిశీలించడం కోసం ఫిన్‌ల్యాండ్, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాలకు తమ బృందం వెళ్లి అధ్యయనం చేసిందన్నారు. కార్యక్రమంలో భాగంగా వండర్ కిడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మళ్ల రామనాయుడును వారు అభినందించారు. ఢిల్లీ నుండి వచ్చిన బృందంలో ఉమాశర్మ, హేమ, విశాల్, సందీప్, ఆష్‌తోష్, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు సభ్యులుగా ఉన్నారు.

ఘనంగా భూలోకనాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కశింకోట : జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు వియ్యపు భూలోకనాయుడు జన్మదిన వేడుకలు శుక్రవారం కసింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు ఆధ్వర్యంలో తాళ్ళపాలెం జంక్షన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తీడ సర్పంచ్ చిరికి సత్యనారాయణ, తాళ్లపాలెం మాజీ సర్పంచ్ చిన్ని వల్లభ నారాయణరావు, నమ్మి గణేష, ఇందల ముసలి నాయుడు, ఉగ్గినపాలెం పాల సంఘం అధ్యక్షులు గాలి శ్రీనివాస్, నమ్మి గణేష్, వైసిపి నాయకులు కొండ్ర శ్రీను, నిమ్మదాల చిట్టి నాయుడు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయండి

మాట్లాడుతున్న వైవి.సుబ్బారెడ్డి, వేదికపై బొత్స, కృష్ణదాస్, అమర్, ఝాన్సీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎన్నికల్లో వైసిపి విజయం కోసం పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీచ్ రోడ్‌లో విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అందరికీ సంక్షేమం అందుతోందన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రాన్ని ఏమాత్రమూ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాసు, విశాఖ ఎంపీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ సుభద్ర, నగర మేయర్ హరి వెంకట కుమారి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

'నీటి సరఫరా, యుజిడి నియామకాల్లో అక్రమాలు'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో నీటి సరఫరా, యుజిడి నియామకాలలో, ప్రమోషన్లలో అక్రమాలు జరుగుతున్నాయని, సమగ్ర విచారణ జరపాలని జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యకులు పి.వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జివిఎంసి నీటి సరఫరా, యుజిడి విభాగాలలో అప్కాస్ వచ్చిన తర్వాత చేపట్టిన 96 మంది నియామకాలలో, 2013 తర్వాత చనిపోయిన, రిటైర్ అయిన కార్మికుల వివరాలు ప్రకారం వారి బిడ్డలకు అవుట్ సోర్సింగ్ ఉపాధి కల్పనలో జరిగిన అన్యాయంపైనా, ప్రమోషన్లలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపైనా పూర్తి విజిలెన్స్ విచారణ జరగాల్సి ఉందన్నారు.

అవినీతి, అక్రమాలకు బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మను కోరారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు డి.శంకర్ రెడ్డి, రాజు, కె.వెంకట్రావు, త్రినాథ్, సత్యనారాయణ, చలపతి, చిన్నారావు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యంతో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పవిత్రమైన భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, అటువంటి కుట్రలను మహిళలు చైతన్యవంతంతో పోరాడి ఎదుర్కోవాలని సామాజికవేత్త డాక్టర్ కె.రమాప్రభ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్ఎడి కొత్తరోడ్డులోని యుటిఎఫ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు, ఐద్వా ఆధ్వర్యంలో మహిళల సమస్యలు, కర్తవ్యాలు అన్న అంశంపై సదస్సు జరిగింది. యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షురాలు రొంగలి ఉమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్ రమాప్రభ మాట్లాడుతూ ఇటీవల పని ప్రదేశాల్లో మహిళలపై అనేక విధాలుగా దాడులు జరుగుతున్నాయన్నారు. అటువంటి పరిస్థితుల్లో మహిళలు చైతన్యవంతులై హక్కులను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, పుణ్యవతి, చినగదిలి మండల ప్రధాన కార్యదర్శి పద్మావతి, ఉపాధ్యాయులు, శ్రామిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసు దర్యాప్తు నివేదికను బయటపెట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఐదు సంవత్సరాలు అవుతోందని, నేటికీ సిబిఐ దర్యాప్తు నివేదికను ఎందుకు బహిర్గత పరచలేదని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రశ్నించారు. కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం మార్కెట్ యార్డ్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి, వైఎస్ వివేకానంద రెడ్డి ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్యాపు నివేదిక బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అస్తవ్యస్త రోడ్డును శుభ్రం చేయించిన కార్పొరేటర్

ప్రజాశక్తి-పరవాడ

జివిఎంసి 79వ వార్డు లంకెలపాలెం జంక్షన్ వద్ద రోడ్డు పెచ్చులూడి అస్తవ్యస్తంగా మారడంతో స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించి, జీవీఎంసీ వాహనాలను రప్పించి శుక్రవారం చేయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎర్ర కోటేశ్వరావు, దాసరి రామారావు, చలపరెడ్డి రామారావు, వెల్డింగ్ శ్రీను, గోరుపూటి దేవుడు, రౌతు రామచంద్రరావు, శంకర్రావు, మడక రమేష్ నాయుడు, తణుకు సత్యనారాయణ పాల్గొన్నారు.

కేసు కొట్టివేత అనంతరం లాయర్‌తో సిపిఎం నాయకులు

సిపిఎం నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 2016లో ఎంఎల్‌సి ఎన్నికల్లో ఆరుగురు సిపిఎం నాయకులపై అక్రమంగా పెట్టిన కేసును విశాఖపట్నం రెండో మెట్రోపాలిటన్ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. సుమారు 8 సంవత్సరాలు సుదీర్ఘంగా సాగిన వాదనల్లో సిపిఎం నాయకులకూ, ఈ కేసుకూ ఎటువంటి సంబంధం లేదని కోర్టు తెలిపింది. నాయకులు కె.లోకనాథం, వివి.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, ముక్కు సుబ్బారావు, వై.రాజు, ఆర్ఎన్.మాధవిలను నిర్దోషులుగా ప్రకటించింది. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా, నీతి నిజాయితీగా పని చేస్తున్న సిపిఎం నాయకులు కోర్టు కేసులకు జడవరని ఈ సందర్భంగా లోకనాథం అన్నారు. ఈ కేసును సీనియర్ న్యాయవాది బివి.రామాంజనేయరావు, వారి జూనియర్ లాయర్స్ చిత్తరంజన్, వెంకట్, సుహాసిని వాదించారు. వారికి సిపిఎం జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది.

ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ధాన్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో గవర్నమెంట్ కంటి హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని శుక్రవారం ఉదయం కొత్త జాలారిపేటలోని రామమందిరం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శస్త్ర చికిత్సలూ చేయించనున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ యంయం.మహేష్, అశోక్ కుమార్ అగర్వాల్, మాణిక్యాలరావు, వి.శీనివాసరావు, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ స్నేహ, డాక్టర్ రిషిత, ఆర్.వసంత్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

17న బిజెపి వైఫల్యాలపై సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 'బిజెపి వాగ్దానాలు, వైఫల్యాలు' అంశంపై ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు అంబేద్కర్ భవనంలో జిల్లాస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు భారత బచావో జిల్లా కన్వీనర్ గూడూరు సీతామహాలక్ష్మి, కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూఈ సదస్సుకు ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. 2014లో బిజెపి అధికారం చేపట్టిన నుంచీ దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. స్విస్ బ్యాంక్ ఖాతాలు బయటపెడతానన్న మోడీ ఇప్పుడు ఎలక్టోరల్ బాండ్ల విషయంలో స్టేట్ బ్యాంక్ ఖాతాలను కూడా బయటపెట్టలేకపోతున్నారని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని చెప్పిన మోడీ అధికారం చేపట్టాక ఆ హామీని విస్మరించారన్నారు. ఆయన పాలనలో ఉద్యోగాలు పోగొట్టుకున్న వారి సంఖ్య రెండు కోట్లు పైమాటే ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. సమావేశంలో వేమన, బి.వెంకటపతిరాజు పాల్గొన్నారు.

కాపులను మోసం చేసిన వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి -అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం రిజర్వేషన్ల పేరుతో కాపులను మోసం చేసిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఐదు శాతం రిజర్వేషన్ల హామీకి కట్టుబడి ఉందని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ వెల్లడించారు. స్థానిక గవరపాలెం టిడిపి కార్యాలయంలో శుక్రవారం కసింకోట మండల టిడిపి, జనసేన, బిజెపి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని తూర్పు కాపులకు సర్టిఫికెట్లు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు గోవింద సత్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, పార్టీ నాయకులు కాయల మురళి, బుద్దిరెడ్డి చిన్నా, ఉగ్గిన రమణ మూర్తి, నిమ్మధల సత్యనారాయణ, పెంటకోట రాము, గొంతిన శ్రీనివాసరావు, గల్లా కొండలరావు, కరక సత్యనారాయణ పాల్గొన్నారు.